క్లుప్తంగా

ప్రతిభామూర్తులను స్మరించుకోవాలి

అద్దంకి రూరల్: రంగస్థలం, సంగీతంలో విశేష ప్రతిభ ప్రదర్శించిన వారి గొప్పతనాన్ని స్మరించుకోవాలని సాహితీవేత్త చేబ్రోలు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్‌లో అద్దంకి డిపో రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభలో సంగీత దర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు, రంగస్థల నటుడు అద్దంకి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ఉటుకూరి రామకోటేశ్వరరావు,గాడేపల్లి దివాకర దత్తు, అద్దంకిలేవీ ప్రసాద్, చప్పిడి వీరయ్య, దేవపాలన, జ్యోతి చంద్ర మౌళి, మన్నం త్రిమూర్తులు, అన్నమనేని వెంకట్రావు, ఆర్‌వీ రాఘవరావు, డీవీఎం పీసీహెచ్ చిన్నా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అద్దంకి: జగన్మాత ఈశ్వరి మహాదేవి అమ్మవారి 235వ ఆరాధనతోపాటు, గురుపూజ మహోత్సవం సందర్భంగా పట్టణంలోని కాకానిపాలెం రోడ్‌లో గల వీర బ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ పెద్దలు ఆదివారం తెలిపారు. దానిలో భాగంగా సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సుప్రభాత సేవ, అఖండ జ్యోతి, గణపతి పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తారు. కావున వీర బ్రహ్మేంద్రస్వామి భక్తులు, ఈశ్వరిదేవి భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు. అనంతరం ఆహ్వాన పత్రిక ఆవిష్కరించారు. చెన్నుపల్లి శ్రీనివాసచారి, పొన్నపల్లి బ్రహ్మానందం, పల్లి కోటిలింగాచారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డు లేదా !

- ఆకాశమే హద్దుగా అక్రమ నిర్మాణాలు
- పట్టణ ప్రణాళికా విభాగంలో అంతులేని అవినీతి
- ప్లాన్ తీసుకునేది ఒకటి.. నిర్మించేది మరొకటి
- మున్సిపల్ అధికారులకు లంచాలిస్తే అడ్డగోలుగా అనుమతులు



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న భవనం

చీరాల: పట్టణ ప్రణాళికా విభాగం అంతులేని అవినీతికి అడ్డాగా మారింది. పట్టణంలో నిర్మిస్తున్న భవనాలకు, అపార్టుమెంట్‌లు, లాడ్జిలు, షాపింగ్ మాల్స్ నిర్మాణాలలో ఒక్కరికి కూడా సరైన అనుమతులు లేవు. సెట్ బ్యాక్ కోసం కనీసం మున్సిపాలిటికి వదిలిపెట్టాల్సిన స్థలాన్ని కూడా అక్రమంగా నిర్మించేసి రోడ్డుసైతం ఆక్రమించేస్తున్నారు. లక్షా 20 వేల జనాభా గల చీరాల వస్త్ర వ్యాపారానికి, ఉన్నత విద్య కోసం రోజుకు వేలాది మంది వచ్చిపోతుంటారు. దీంతో ట్రాఫిక్ వ్యవస్థ పద్మవ్యూహంగా మారింది. ప్రధానంగా ఈ అక్రమ నిర్మాణాలు రోడ్లను సైతం ఆక్రమించి కడుతున్నారు. అనుమతుల పేరుతో లక్షలలో లంచాలు తీసుకుంటున్న టౌన్ ప్లానింగ్, మున్సిపల్ అధికారులు లంచాల పునాదులపై నిర్మిస్తున్న ఈ భవనాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఉదాహరణకు బస్టాండ్ ఆవరణలో భారీ స్థాయిలో లాడ్జీ నిర్మాణం జరుగుతుంది. ఆర్టీసీ, మున్సిపల్ అధికారులకు జీ ప్లస్–1 అనుమతులు పొంది ఏకంగా జీ ప్లస్–2 నిర్మాణాన్ని చేపట్టారు. కనీసం ఒడా అనుమతులు కూడా తీసుకోకుండా పనులు జరుగుతున్నాయి. బహిరంగంగా అందరి కళ్ల ముందు జరుగుతున్నా ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చి మమ అనిపించారు. ఈ అక్రమ నిర్మాణ వ్యవహారంలో అధికారులకు భారీ స్థాయిలో ముడుపులు ముట్టాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్మాణాలు జరిగే సమయంలో అడ్డుకోకుండా తర్వాత నోటీసులు ఇవ్వడం అర్థం కాని విషయంగా మారింది. పట్టణంలోని పాపరాజుతోటలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసు వద్ద నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మించారు. ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం ఫైరింజన్ అక్కడకు వెళ్లే పరిస్థితి లేదు. రోడ్డు నుంచి ఏడు అడుగులు సెట్ బ్యాంక్, చుట్టూ ఐదు అడుగులు ఖాళీ స్థలం వదలాల్సి ఉండగా ఇదేమి పట్టించుకోకుండా రోడ్డుకు ఆనుకొని నిర్మాణాలు జరుగుతున్నాయి. మురుగు కాలువలపై కూడా శ్లాబులు వేసి ఆక్రమించేస్తున్నారు. పాపరాజుతోటలో ఈ విధంగా అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. అలానే వ్యాపారపరంగా రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న చీరాల హైస్కూల్ రోడ్డులో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు కోకొల్లలుగా ఉన్నాయి. ఆన్‌లైన్ సిస్టమ్ వచ్చిన తర్వాత మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు నోటీసులు ఇచ్చి వారి వద్ద నుంచి భారీగా నగదు వసూలు చేస్తున్నారు.

రీమోడలింగ్ పేరుతో బహుళ అంతస్తులు..

బాపట్ల జిల్లాలో పెద్ద పట్టణంగా పేరొందిన చీరాల రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత చీరాల ప్రాంతానికి బహుళ అంతస్తులు, పేరొందిన కార్పొరేట్ హాస్పిటల్స్ వచ్చాయి. అయితే బహుళ అంతస్తులను నిర్మించి వాటిలో హాస్పిటల్స్ నిర్వాహకులు లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నారు. గడియార స్తంభం సెంటర్‌లో ఓ భవనానికి రీ మోడలింగ్ చేస్తున్నట్లుగా చూపించి భారీ భవనాన్ని నిర్మించారు. అలానే పలు ప్రైవేటు హాస్పిటల్స్ నిర్వాహకులు కూడా కొద్ది పాటి స్థలంలోనే బహుళ అంతస్తులను నిర్మించేస్తున్నారు. బహుళ అంతస్తులకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అనుమతులతో పాటు పలు ప్రభుత్వ శాఖల అనుమతులు ఉండాలి. రాజకీయ పలుకుబడితో కొందరు, లంచాలతో మరికొందరు అధికారులను ప్రసన్నం చేసుకుని భవనాలను ఆకాశమే హద్దుగా నిర్మించేస్తున్నారు. టౌన్ ప్లానింగ్‌లో తీసుకున్న అనుమతులకు నిర్మించిన భవానాలకు పొంతన లేదు. అక్రమ నిర్మాణలు చేశారంటూ ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్మించిన తర్వాత నోటీసులు ఇస్తూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి ఇష్టారాజ్యంగా అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలకు అడ్డుకట్ట వేస్తారో వేచి చూడాలి.

> **నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చాం..**
>
> ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్మిస్తున్న భవానినికి జీ ప్లస్–1 మాత్రమే అనుమతులు ఇచ్చాం. అయితే జీప్లస్–2 నిర్మాణాలు చేస్తున్నారని తెలియడంతో వారికి నోటీసు ఇచ్చాం. అనుమతులు పొందిన వారు నిబంధనల మేరకు మాత్రమే నిర్మాణాలు చేపట్టాలి.
>
> – జే.శ్యామల, ఆర్టీసీ డీఎం, చీరాల

> **చర్యలు తీసుకుంటాం..**
>
> పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వారిపై చర్యలు తీసుకుంటాం. అలానే అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వాటిని పరిశీలించి నిబంధనలు అతిక్రమిస్తే వారికి నోటీసులు ఇస్తాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం.
>
> – అబ్దుల్ రషీద్, మున్సిపల్ కమిషనర్



పాపరాజుతోటలో నిర్మిస్తున్న బహుళ అంతస్తు భవనం



పాపరాజుతోటలో నిర్మిస్తున్న భవనం

క్రీడలపై యువత ఆసక్తి కలిగి ఉండాలి



ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

చీరాల రూరల్: క్రీడల పట్ల యువత ఆసక్తి కలిగి ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి కిరణ్మయి దేవిరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం స్థానిక ఎస్ఆర్అండ్‌వీఎం హైస్కూలు క్రీడా మైదానంలో శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యువతకు ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూలు ఎస్ఎంసీ చైర్మన్ దగ్గుబాటి రాంబాబు పాల్గొని క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. నేటి యువత చెడు మార్గాల్లో నడవకుండా క్రీడలపై ఆసక్తి చూపాలని కోరారు. కార్యక్రమ నిర్వాహకులు మీనాక్షి మాట్లాడుతూ ప్రతి ఏడాది నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో యువతకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు నరేష్, జిల్లా ఫుట్‌బాల్ కోఆర్డినేటర్ దేవదాసు, కోచ్‌లు ప్రసన్న, బాలాజీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డుల పంట



అవార్డులు అందుకుంటున్న వాకర్స్ ప్రతినిధులు

చీరాల రూరల్: ఇంటర్నేషనల్ వాకర్స్, ఎస్ఆర్అండ్‌వీఎం చీరాల వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డుల పంట పండింది. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 కాన్ఫరెన్స్, అవార్డు కార్యక్రమాలు ఆదివారం నెల్లూరులోని జీపీఆర్ కల్యాణ మండపంలో నిర్వహించారు. 2024లో చేసిన సేవా కార్యక్రమాలకుగాను అలానే ఇంటర్నేషనల్ వాకర్స్ ఫౌండేషన్‌కు 26 ఎంజీఎఫ్‌లు జీవితకాల సభ్యత్వాలు రూ. 1.82 లక్షలు అందించినందుకుగాను వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వి. మురళీ మోహనరావు, డిస్ట్రిక్ట్ గవర్నర్ పి. శ్రీనివాసులురెడ్డి చేతులు మీదుగా చీరాల వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పోలుదాసు రామకృష్ణ, సెక్రటరీ చారుగుళ్ల గురుప్రసాద్‌కు బెస్ట్ ప్రెసిడెంట్, బెస్ట్ సెక్రటరి అవార్డులు అందజేశారు. అలానే 8 మెమెంటోలతో పాటు కప్పు అందజేశారు. కార్యక్రమంలో చీరాల వాకర్స్ ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, చెలికాని సీతారామయ్య, సుబ్బారావు, డాక్టర్ ఇస్తర్ల బాబురావు, సుభాషిణి, బలరామనాయుడు, అమరా వీరాంజనేయులు, దేగల తిరుపతిరావు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



పంచాయితీ కార్మికులకు, పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేస్తున్న మేడికొండ ప్రకాష్, కవిత దంపతులు

చీరాల రూరల్: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎస్ఆర్అండ్‌వీఎం హైస్కూలు రోడ్డులోని ప్రకాష్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గుంట మార్కెట్ వద్దగల వారి గృహంలో 100 మంది పేదలకు, పంచాయతీ కార్మికులకు, రిక్షా కార్మికులకు దుప్పట్లు, రగ్గులు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత మేడికొండ ప్రకాష్, కవిత దంపతులు మాట్లాడారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ప్రతి ఏడాది క్రమం తప్పకుండా పేదలకు తమకు తోచిన విధంగా సహాయం చేస్తున్నట్లు చెప్పారు. తగ 50 ఏళ్లుగా తాము ఎటువంటి పరిస్థితులలో ఉన్నాసరే క్రమం తప్పకుండా కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రభువైన ఏసుక్రీస్తు మనపై ఏవిధంగా జాలి, కరుణ, దయ చూపించారో మనం కూడా ఇతరులపై అదే విధమైన భావాలు చూపించాలని సూచించారు.కార్యక్రమానికి ముందు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అందరికి ప్రేమ విందు ఏర్పాటుచేసి బైబిల్స్, నూతన సంవత్సరం క్యాలెండర్లు అందజేశారు. కార్యక్రమంలో దంత వైద్యులు డాక్టర్ మేడికొండ అబ్రహం బ్లెస్సీ, డాక్టర్ సుజనా అబ్రహాం పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం



సుబ్బారావుకి మెడికల్ కిట్‌లు అందిస్తున్న దాతలు



షుగరు వైద్య శిబిరానికి హాజరైన రోగులు

వేటపాలెం: ప్రస్తుత కాలంలో డబ్బే ప్రధాన లక్ష్యంగా వైద్యసేవలు అందిస్తున్న రోజుల్లో పేద ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్న దాతలను అభినందించారు. పందిళ్లపల్లిలో ఉచితంగా పేద ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్న పమిడాల సుబ్బారావుకి దాతలు సమకూర్చిన నగదుతో రూ.10 వేల విలువగల మెడికల్ కిట్‌లు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాత పల్లపోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్న సుబ్బారావుకి తమ వంతు సహకారం అందిచేందు కుగాను మరికొందరి సహకారంతో మెడికల్ కిట్‌లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రాంబాబు, నాగరాజు, సాంబయ్య, ఏరాసు భసవేశ్వరరావు, పి నాగార్జున, సత్యనారాయన, కృష్ణ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

షుగర్ శిబిరంలో 1037 మందికి వైద్య పరీక్షలు..

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికి సేవ చేయడమే రామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్యమని ఆశ్రమం మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం మండలంలోని వాడరేవు గ్రామంలోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి హాజరైన 1037 మంది రోగులకు డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమం మేనేజర్ సురేష్, ట్రస్ట్ ప్రతినిధులు కృష్ణారావు, శంకరరావు, సురేష్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

చీరాల టౌన్: భక్తుల కొంగు బంగారం.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన తోటవారిపాలెం పోలేరమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. బాపట్ల, ప్రకాశం, గుంటూరు, పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. గ్రామాన్ని సుభిక్షంగా ఉంచడంతో పాటుగా కోరిన కోర్కెలు తీర్చే పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు సౌకర్యాలను కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఇంగ్లిషు గ్రామర్ బుక్స్ పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని దుద్దుకూరు ఆచార్యరంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు రావినూతల గ్రామానికి చెందిన తాటి ఇందిర మెమోరియల్ ఎడ్యుకేషన్ సొసైటీ (టైమ్స్) ఇంగ్లిషు గ్రామర్ బుక్స్ పంపిణీ చేశారు. ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఇంగ్లిషు గ్రామర్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం యూ చెంచయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సొసైటీ ప్రతినిధులు పద్మజ, శ్రీరంజినిలు మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు ఉన్నత విద్య నిమిత్తమై ప్రతి సంవత్సరం ఫౌండేషన్ ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్‌లు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పీ రామకృష్ణ, కే శ్రీలక్ష్మి,జీ చిన బాబు, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా నమోదుకు మరో అవకాశం

పర్చూరు (చినగంజాం): రబీ సీజన్‌లో సాగు చేసిన శనగ, మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పంటలకు బీమా చేసుకునేందుకు బ్యాంక్ ద్వారా మరో అవకాశం కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎస్ రామ్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు డిసెంబరు 16 వతేదీ లోపు ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం ద్వారా కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో పంట బీమా చేసుకోనట్లయితే బ్యాంకు ద్వారా చేసుకునేందుకు మరో అవకాశం ఉందన్నారు. రైతులు బ్యాంక్ ద్వారా ఖరీఫ్, రబీ సీజన్‌లో పంట రుణం తీసుకుంటే రైతులు మీ బ్యాంక్ మేనేజర్‌ను కలిసి పంటల బీమా డిసెంబర్ 31లోపు ఎన్‌సీఐపీ పోర్టల్ ద్వారా పంటల బీమా నమోదుకు అవకాశం ఉందన్నారు.

క్రిస్మస్ పండుగకు చర్చిల ముస్తాబు



ప్రార్థనల్లో పాల్గొన్న మహిళలు

బల్లికురవ: క్రిస్మస్ పండుగకు మండలంలోని చర్చిలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి భారీ స్టార్‌లు ఏర్పాటు చేశారు. పాత మల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం, వల్లాపల్లి, బల్లికురవ, నక్కబొక్కలపాడు, చెన్నుపల్లి, కొణిదెన, కొప్పరపాలెం, వైదన కూకట్లపల్లి, గొర్రెపాడు, కొప్పరపాడు, గ్రామాల్లోని చర్చిలను వేడుకలకు ముస్తాబు చేశారు. క్రైస్తవులు నెలరోజులుగా ఎంతో భక్తి శ్రద్ధలతో చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. బుధ, గురువారంతో వేడుకలు ముగియనున్నాయి. దూరప్రాంతాల్లో ఉన్న బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండుగ తావరణం నెలకొనిఉంది.



వల్లాపల్లిలో విద్యుత్ దీపాలతో అలంకరించిన చర్చి



పాతమల్లాయపాలెం చర్చి

మత్తులో జోగుతున్న రేణింగవరం



ఫ్లైఓవర్‌పై మద్యం తాగుతున్న మందుబాబు

జే.పంగులూరు: జాతీయ రహదారి, పోలీసు స్టేషన్ అందుబాటులో ఉన్న రేణింగవరం గ్రామం మత్తులో తూగుతోంది. గ్రామంలో 24 గంటలు మద్యం అందుబాటులో ఉంటుంది. గ్రామంలో ఇంచుమించు 10 వరకు బెల్టుషాపులు ఉన్నాయి. కుటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. యువకులు సైతం మందుకు బానిసలైపోతున్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఈ బెల్టుషపులు నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఫ్లైఓవర్, ఫ్లైఓవర్ కింద ఎప్పుడు మద్యం ప్రియులు మద్యం తాగుతుంటారు. రాత్రిళ్లు సమయంలో గ్రామంలో బస్సు దిగి మహిళలు రావాలంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు గమనించి గ్రామం, ఫ్లైఓవర్ కింద మద్యం తాగే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

ముగిసిన శిల్పం-చిత్రలేఖనం శిక్షణ



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

అద్దంకి రూరల్: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కలశం ఫైన్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో అద్దంకిలో దళితులకు నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. శిక్షణలో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు స్థానిక విశ్వభారతి జూనియర్ కళాశాల డైరక్టర్ బీ. ఆదినారాయణ, ఎం వీరరాజు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అకాడమి డైరక్టర్ అనూషా పాల్గొన్నారు.

ఇంకొల్లులో నేత్రదానం



కరి లక్ష్మి (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): ఇంకొల్లు గ్రామానికి చెందిన కరిలక్ష్మి (80) ఆదివారం మృతి చెందడంతో వారి బంధువులు ఆమె నేత్రాలను దానం చేశారు. రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర్ కంటి వైద్యశాల వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు అడిగిన వెంటనే ముందుకు వచ్చిన వారి కుమారులు గంగాధరరావు, హరిబాబు, కోడళ్లు జమున, సుజాతలను రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ ప్రతినిధులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు(స్వామి), క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ షేక్ రఫి, చుండి సాంబశివరావులు అభినందించారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ఇంకొల్లు (చినగంజాం): యూటీఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మోడల్ ప్రశ్నపత్రం పుస్తకం ఆవిష్కరించారు. ఆదివారం ఇంకొల్లులోని టీచర్స్ హోంలో నిర్వహించారు. మండల యూటీఎఫ్ అధ్యక్షుడు పీ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 400 మంది పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మండల శాఖ ప్రధాన కార్యదర్శి మస్తాన్‌వలి, జిల్లా బాధ్యుడు చెంచయ్య, వీ విజయలక్ష్మి, సీహెచ్ హనుమంతరావు పాల్గొన్నారు.



మెటీరియల్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

టాలెంట్ టెస్ట్‌కు విశేష స్పందన

మేదరమెట్ల: విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్టుకు విశేష స్పందన లభించింది. ఆదివారం కొరిశపాడు మండలం రావినూతల జెడ్పీహెచ్ఎస్‌లో యలగాల సుబ్బారావు స్మారక ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఐదు మండలాలకు చెందిన పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అద్దంకి, జే.పంగులూరు, బల్లికురవ, ఇంకొల్లు, కొరిశపాడు మండలాలకు చెందిన 33 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఓసీ, బీసీ, ఎస్సీఎస్టీ కేటగిరీలలో నిర్వహించిన పరీక్షలో గెలుపొందిన విద్యార్థులకు వరుసగా రూ.1500, రూ.1000, రూ.5000 నగదు బహుమతులు అందచేశారు. ఈ బహుమతులను యలగాల సుబ్బారావు కుమారుడు డాక్టర్ యలగాల గోపీచంద్ అందచేశారు.



టాలెంట్ టెస్ట్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు